క్లుప్తంగా

ఈటల అనుచరుల భేటీ



కమలాపూర్ : మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అనుచరులు సోమవారం కమలాపూర్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించినట్లు తెలిసింది. సుమారు 25 ఏళ్లుగా ఈటల రాజేందర్ వెన్నంటి నడిచిన తమకు ప్రస్తుతం బీజేపీలో ఎలాంటి గుర్తింపు, స్థానం ఉంటుందోననే అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఈటల వెంట ఉంటూ ఆయన పిలుపు మేరకు బీజేపీలో చేరిన తమకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అవకాశం ఇస్తుందో, లేదోనని చర్చించినట్లు సమాచారం. బీజేపీ నుంచి సరైన సపోర్ట్ లభించని పక్షంలో ఏం చేయాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించినట్లు, పార్టీ తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే ప్రత్యామ్నాయ ఆలోచన దిశగా అడుగులు వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

విద్యుత్ తీగలు సరిచేసిన అధికారులు



వేలేరు : పంట పొలాల్లో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉండడంతో ఆదివారం సాక్షి దినపత్రిలో 'వేలాడుతున్న విద్యుత్ తీగలు' కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

'గోదాంల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి'

నెక్కొండ : మండలంలోని 'చల్లా' గోదాంల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో స్థానికులు సోమవారం ధర్నా చేశారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. గోదాముల నుంచి వస్తున్న లక్క పురుగులతో ఆరోగ్యం దెబ్బతింటోందని వాపోయారు. లక్క పురుగుల ఉధృతిని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. లక్క పురుగుల ఉధృతితో కంటి మీద కునుకు ఉండడం లేదన్నారు. గోదాముల నిర్వహకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెప్పారు. లక్క పురుగుల నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ ఈఓ సదానందానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు దాసరి శ్రీనివాస్, పలుసం పూర్ణచందర్, తాటిపెల్లి శివకుమార్, కారింగుల సురేశ్, నవీన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

నల్లబెల్లి : మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దూరి తిరుపతిరావు కోరారు. మండలంలోని నందిగామ, రేలకుంట గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా తిరుపతిరావును ఆయా గ్రామాల్లో శాలువాలతో సన్మానించారు.

ఆర్‌ఎఫ్‌డబ్ల్యూసీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తనిఖీ



సంగెం : మండల కేంద్రంలోని గ్రామీణ కుటుంబ సంక్షేమ కేంద్రాన్ని (ఆర్‌ఎఫ్‌డబ్ల్యూసీ) డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొమురయ్య సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమయపాలన పాటించాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పీహెచ్‌సీలో వసతులు కల్పించాలి

గీసుకొండ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కనకం సంధ్య డిమాండ్ చేశారు. ఆమె ఆధ్వర్యంలోని బృందం ఆస్పత్రిని సోమవారం సందర్శించి వసతులు, వైద్య సేవలను పరిశీలించింది. అనంతరం ఆమె రోగులతో మాట్లాడారు.

ప్రహరీ లేని పశువైద్యశాల

- వర్షానికి ఆవరణమంతా జలమయం
- దృష్టిసారించని అధికారులు
- సిబ్బందికి తప్పని ఇబ్బందులు



ప్రహరీ లేకుండా ఉన్న పశువైద్యశాల ప్రాంగణం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పశు వైద్యశాలకు ప్రహరీ లేకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం పశుసంవర్ధక శాఖపై దృష్టిసారించి నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు. పశువైద్యశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆస్పత్రిలోకి కుక్కలు, పందులు చేరుతున్నాయి. దీంతో ఆవరణమంతా అపరిశుభ్రంగా మారుతుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దకాలం క్రితం అదనపు గదులు నిర్మించారు. ఆ తర్వాత పలుమార్లు ప్రహరీ నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించినప్పటికీ ఫలితం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మూగజీవాలకు సేవలు అందించే పశువైద్యశాలలో సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

లోతట్టుగా ఆవరణం

పశువైద్యశాల ఆత్మకూరు–వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలో ఉంది. రోడ్డు నిర్మాణం సమయంలో రోడ్డు ఎత్తు పెరగడంతో ఆస్పత్రి ఆవరణం లోతట్టుగా మారింది. దీంతో వర్షం కురిస్తే నీరు నిలిచి చెరువును తలపిస్తుందని సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి మౌలిక వసతులతో పాటు ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షం కారణంగా వరద నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వ్యాప్తిచెందుతున్నాయని, దీంతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని సిబ్బంది భయాందోళన చెతుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.



మండల కేద్రంలోని పశువైద్యశాల

ఆస్పత్రికి ప్రహరీ నిర్మించాలి

మండల కేంద్రంలోని పశువైద్యశాలకు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి వెంటనే నిర్మించాలి. ప్రహరీ ఉంటే ఆస్పత్రికి రక్షణగా ఉంటుంది.

– సంతోశ్‌గౌడ్, ఆత్మకూరు

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

పశు వైద్యశాలకు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– డాక్టర్ ధర్మానాయక్, పశువైద్యాధికారి

లోపాలు గుర్తించేందుకే సామాజిక తనిఖీలు

- అదనపు డీఆర్డీఓ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసరావు

దామెర : జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో నెలకొన్న లోపాలను గుర్తించేందుకే సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అదనపు డీఆర్డీఓ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో (5వ విడత) సామాజిక తనిఖీల్లో భాగంగా సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, కూలీల హాజరు, వేతనాల చెల్లింపులు, తనిఖీ బృందాలు గ్రామాల్లో గుర్తించిన అంశాలపై చర్చించారు. గ్రామాల్లో నాటిన కొన్ని మొక్కలు చనిపోయినట్లు, ఒకరికి బదులు మరొకరు పనులకు వెళ్లడం, ఒకరికి రావాల్సిన కూలీ డబ్బులు మరొకరికి చెల్లించడం వంటి లోపాలు గుర్తించినట్లు చెప్పారు. దీంతో రూ.2,913 జరిమానాను ఫీల్డ్ అసిస్టెంట్లకు విధించినట్లు తెలిపారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ .. గుర్తించిన లోపాలను సరిచేసుకుని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి నర్సింహారెడ్డి, ఎంపీడీఓలు శ్రీనివాస్‌రెడ్డి, కల్పన, పీఆర్ ఏఈ సమ్మిరెడ్డి, ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, ఎస్‌ఆర్పీ కవిత, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పలువురి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు : మాజీ జెడ్పీటీసీ చాడ సరిత అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, డాక్టర్ గుండె విజయ రామరావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, వొడితెల సతీశ్‌కుమార్, తాటికొండ రాజయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమా, సింగపురం ఇమ్మాన్యుయేల్ రాజ్, ప్రభుదేవా తదితరులు హాజరై చాడ సరిత భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం



కవిత దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

శాయంపేట : హైదరాబాద్‌లోని క్యూ న్యూస్ కార్యాలయం, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దామెరకొండ కొమురయ్య ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న బీసీల కోసం పోరాటం చేస్తుంటే జాగృతి అధ్యక్షురాలు కవిత బీసీ ముసుగులో మోసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్సీ మల్లన్నపై, అతడి కార్యాలయంపై జాగృతి నాయకులు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. మళ్లీ దొరల పాలన వస్తుందనేందుకు సంకేతం ఈ దాడి అన్నారు. కవితపై, దాడికి పాల్పడిన దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రవిపాల్, నాయకులు శంకర్, తీన్మార్ జై, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు జన్‌ధన్ ఖాతాలు



బ్యాంకు ఖాతాలు పొందిన విద్యార్థులు

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురం గ్రామంలో గల మహాత్మా జ్యోతిబాపూలే, తెలంగాణ బీసీ వెల్ఫేర్ పాఠశాలలో సోమవారం జనగాం జిల్లా, స్టేషన్ ఘన్‌పూర్ మండలం, శివునిపల్లిలోని ఎస్‌బీఐ, సీఎఫ్‌ఎల్ వారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జన్‌ధన్ ఖాతాలు అందించారు. విద్యార్థులకు బ్యాంకు ఖాతా పాస్‌బుక్కు, ఏటీఎం కార్డులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ రుక్సానా, ఇన్‌చార్జ్ స్వప్న, స్టేషన్ ఘన్‌పూర్ ఐఎఫెల్ కౌన్సిలర్స్ రాకేష్, చందర్, భార్గవి, ఏరియా కోఆర్డినేటర్ దయాకర్, క్లస్టర్ కోఆర్డినేటర్ సంతోశ్, శివునిపల్లి బ్యాంక్ మిత్ర సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తాం

- బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి



ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

కమలాపూర్ : ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను స్థానిక బీజేపీ శ్రేణులతో కలిసి సోమవారం పరిశీలించారు. రైల్వే అధికారులతో మాట్లాడి రైల్వే స్టేషన్, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రధానంగా ఉప్పల్ ఆర్వోబీని త్వరితగతిన పూర్తి చేయించాలనే లక్ష్యంతో మంత్రి బండి సంజయ్ ఉన్నారని, ఆ దిశగా అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

ఆర్వోబీపై కాంగ్రెస్‌వి చిల్లర మాటలు

ఉప్పల్ ఆర్వోబీపై కాంగ్రెస్ నాయకులు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, బండి సంజయ్‌పై అనవసర విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఏ రోజైనా రైల్వే సమస్యలు, ప్రయాణికుల కష్టాల గురించి ఆలోచన చేయలేదన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సుధాకర్, శోభన్, ప్రవీణ్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేలేరు : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో పోలీస్‌లు పెట్రోలింగ్ చేస్తుండగా అటువైపుగా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన పెరుమాండ్ల రాజగోపాల్‌రెడ్డి ట్రాక్టర్ ద్వారా అనుమతి లేకుండా ఇసుక రవాణ చేస్తుండగా పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలింపు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఇసుక తరలింపునకు అనుమతులు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఫ్యూషన్ ఫైనాన్స్ సంస్థ సిబ్బంది

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫ్యూషన్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, కంపాక్స్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డిప్యూటీ మేనేజర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు ఈ సాయం అందించినట్లు చెప్పారు. ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో నీటి సౌకర్యార్థం కోసం వాటర్ ప్యూరిఫయర్లు అందించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణిరవీందర్, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సై మధు, మాజీ ఎంపీపీ రమేశ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన కలకోటి రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1996–97 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు సోమవారం పరామర్శించారు. రాజేందర్ కుటుంబానికి రూ.22,300 నగదును ఆర్థికసాయంగా అందించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన 10మంది మహిళలకు రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ వారి సహకారంతో హనుమకొండ క్లబ్‌లో సోమవారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ద్వారా సహకారాన్ని అందించిన మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డికి మహిళలు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- చలివాగు ప్రాజెక్టు సాగునీరు విడుదల



చలివాగు ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని జోగంపల్లి శివారులో గల చలివాగు ప్రాజెక్టు ఆయకట్టుకు సోమవారం ఆయన చలివాగు ప్రాజెక్టులోని నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. రైతులు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న డీసీసీ మేనేజర్ హరిత, సొసైటీ చైర్మన్, సిబ్బంది



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణం బాగుండాలంటే మొక్కలు నాటాలని అన్నారు. మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పెండెం రాజు, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, కార్యదర్శి శ్వేత, ఉపాధ్యాయులు నర్సింహస్వామి, వసంత తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆవరణలో..

వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని పీఏసీఎస్ (సొసైటీ) ఆవరణలో డీసీసీ బ్యాంకు మేనేజర్ హరిత మొక్క నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, ఏఓ యాదగిరి, ఏఈఓ సౌమ్య, సీఈఓ ఓంప్రకాశ్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

గణిత భావనలను పరిచయం చేయాలి

- హెచ్‌ఎం సారయ్య నాయక్



మాట్లాడుతున్న సారయ్యనాయక్

శాయంపేట : ఉపాధ్యాయులు గణిత భావనలను విద్యార్థులకు సులువుగా పరిచయం చేయాలని పెద్దకోడెపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మాలోతు సారయ్య నాయక్ సూచించారు. మండలంలోని పెద్దకోడెపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమికోన్నత స్థాయి గణిత ఉపాధ్యాయుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి గణితాన్ని తన దైనందిన జీవితంలో సులువుగా ఉపయోగించుకునేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు గణితంపై భయం పోయే విధంగా తయారు చేయాలని అన్నారు. గణితం అర్థం చేసుకుంటే చాలా సులభమని, దీన్ని విద్యార్థులకు తెలిపి గణితంపై మక్కువ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు రఘు, రజనీకాంత్, ఉదయ్, సీఆర్పీ వంశీ, శాయంపేట, పరకాల, నడికూడ మండలాల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



ఆత్మకూరు : పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రజనీకర్‌రెడ్డి

దామెర : ప్రభుత్వ భూములను పరిరక్షించాలని మండలంలోని ల్యాదెళ్లకు చెందిన పలువురు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాదాసు వెంకటేశ్వర్లుతో పాటు పలువురు సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పల్లెప్రకృతి వనాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని బీమారపు రాజయ్య అనే వ్యక్తి ఆక్రమించుకుని హోటల్ పేరుతో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలకు చెందిన భూమిలో కొంత మేరకు గ్రామానికి చెందిన కలువాల రాజేశ్వర్‌రావు ఆక్రమించుకున్నట్లు అందులో పేర్కొన్నారు. సర్వే నంబర్ 21/1లో గల 23, 25 ఎకరాల దేవాలయ భూమిలో అక్రమ కట్టడాలు చేపడుతున్నట్లు ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమి కాపాడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఉపసర్పంచ్ కీర్తి, స్థానికులు జెల్ల ప్రవీణ్, బీమారపు రాజు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి పన్నుల వసూల్లో అక్రమాలకు పాల్పడ్డారని చర్యలు తీసుకోవాలని గుడెప్పాడ్ మాజీ ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి క్రాంతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు త్వరగా పూర్తిచేయాలి

ఐనవోలు : మండలంలోని కొండపర్తి నుంచి కొత్తపల్లి వరకు నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండటంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని బీజేపీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఫిర్యాదు చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ మాట్లాడుతూ.. కంకర, డస్ట్‌తో రెండు సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. కోట కిరణ్, బుర్ర రమేశ్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఐనవోలు : వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 2001–2002లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఒకే వేదికగా కలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆవిష్కరించారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు, సమ్మేళన నిర్వహణకు సహకరించిన అన్వర్‌పాషా, మాధవిని అభినందించారు.